# ఎగిరే పెళ్ళాలు

ఎగిరే పళ్ళేలున్నాయా లేవా అని తర్జన భర్జనలు జనులు పడుతున్నారు. లేవన్నవారు లేవన్నారు. ఉన్నాయన్నవారు ఉన్నాయంటున్నారు. అంతుతెలియని ఆబ్జెక్ట్సు ఆకాశంలో ఎగరడంచూశామన్నారు. దట్సాల్!

అంతుతెలియని ఆబ్జెక్ట్సు గృహమండలంలోనూ ఎగుర్తాయి. అవి పళ్ళేలే కానక్కరలేదు. గరిట్లూ, చమ్చాస్, గిన్నెల్లూ, చెంబులూ అన్నీ ఎగుర్తాయి ఎగిరే పెళ్లాలున్నచోట! ఎగిరే పళ్లేలూ-ఎగిరే పెళ్ళాలు రెండూ నిజవే- ఆకాశమంతెత్తు ఎగిరే పెళ్ళాలున్నచోట ఎగిరే పళ్లేలెందుకుండవు? పళ్లేనికి పెళ్ళానికీ వున్న గొళ్ళెం విడగొట్టడం సామాన్యం కాదు. పళ్ళెం నిండా రూపాయలు పుచ్చుకుని వచ్చేదేకదా పెళ్లాం -- పళ్ళెంనిండా నోట్లకట్టల్ని చూశాక పెళ్ళాన్ని తెచ్చుకోవడమనే తంతు ఒహటుందికదా! దాన్నే ముద్దుగా మనవారు పెళ్ళి అన్నారు, పళ్ళెంలో కాళ్ళు కడిగాకే పిల్లనిస్తారుకదా.

పెళ్ళిలో కట్న కానుక్సు సరిగా జరపకపోతే పళ్లేలు ఎగుర్తాయి. ఎగిరే పెళ్ళాలున్నపుడు ఎగిరే మొగుళ్ళూ వుంటారు. ఈ ఎగరడవనే ప్రక్రియ ఉచ్ఛస్థితిని సూచిస్తుంది. ఉచ్ఛస్థితి అనగానేమి? ఉన్నచోటు నుండి ఎత్తుకి లంఘించడం, ఎంత ఎత్తుకి ఎగిరినా మళ్ళీ ఉన్న చోటుకి వచ్చి పడాల్సిందే. భూమ్యాకర్షణ శక్తినుంచి స్త్రీ ఆకర్షణనుంచీ ఎంత ఎత్తుకి ఎగరగలిగితే అంతక్రిందకు మళ్ళీ దిగివచ్చి పడాల్సిందే. ఎగిరే మొగుళ్ళు అప్పుడప్పుడు వచ్చి కాళ్ళమీద పడటం కద్దు. కలహాంతం ప్రణయం, కాఫ్యాతం కౌగిలి అని అప్పటికప్పుడు సరిపెట్టుకోవాలి. కల

హంకూడా సాధారణస్థితికి వ్యతిరేకమేకదా! వ్యతిరేకం కాకపోతే పోనీ భిన్నమైనదనుకోండి.

సాధారణమైనవన్నీ నేలబారు కార్యకలాపాలు. నేలవిడచి సాము చేయడం, గాలిలో ఎగరడం, ఆ గాలి కాస్త తగ్గాక చాపచుట్టలా కూలబడటం, మొగుళ్ళూ పెళ్లాలూ వంతులవారీగా జీవితంలోఅనుభవిస్తున్నట్టివే. అనుభవాలన్నీ అందంగా చెప్పుకోతగ్గవికావుకూడాను. ఎగిరే పెళ్ళాలు అందవైన అనుభవాలను ప్రసాదించకపోవచ్చు. ఎగిరే మొగుళ్ళూ అంతే—

ఎగరడవనే తాపత్రయం వెనుక, సంఘంలో వీపుగోకి అరికాళ్ళలోనూ అరిచేతులలోనూ దురదపుట్టించే పరిస్థితులుంటాయి. ఈ పరిస్థితుల ప్రభావ భావాంబరవీధిలో పళ్ళేలూ ఎగుర్తాయి, పెళ్ళాలూఎగుర్తారు (మొగుళ్ళ సంగతి సరేసరి).

ఎగిరేవయసని ఒకటుంటుంది. అప్పుడు ఎగరడం ఒకముచ్చట. ఎగరటం వేరు ఎగరేసుకుపోవడం వేరు. (పడుచుపిల్లల్ని కాదు). కొందర్ని డబ్బు ఎగరేస్తే కొందర్ని అధికారం ఎగరేస్తుంది. కొంతమంది కీర్తి కోసం ఎగుర్తూంటారు. కీర్తి, అధికారం, డబ్బుకోసం ఎగిరేవాళ్ళ ఎగురుళ్ళు చూడలేక ఎగరలేనివాళ్ళు అవస్థలు పడుతూంటారు! (రచయితలు కొంతకాలం ఎగిరారు). ఇప్పుడు రచయిత్రులు ఎగుర్తున్నారు. కనుక రచయిత్రులు సాహిత్యాడంబర వీథిలో ఎగిరేపళ్ళేలు. (ఇందులో కొన్ని ప్రేమ పళ్లేలు-కొన్ని అపార్థపు పళ్లేలు-కొన్ని ఆదర్శపు పళ్లేలూ. ఈ పళ్లేలు వార మాస పత్రికలచుట్టూ తద్వారా పాఠకుల మానసాకాశంలో జెట్ వేగంతో తిరుగుతూంటాయి).

ఈ ప్రేమ పళ్లేలతోనూ ఆదర్శపు పళ్లేలతోనూ అపార్థపుజిగురే కాకుండా, రంగుల నీతులూ, సంప్రదాయాల చద్దెన్నమూ, భారతీయసంస్కృతి పులిహోర, పాతివ్రత్యపు పాతాలసారం రసం, కలహాల చిట్టిగారెలూ, ప్రేమ బూరెలూ, ఆధ్యాత్మిక లడ్డూలు వడ్డిస్తూంటారు వయ్యా

రంగా. పళ్ళెం తర్వాత పళ్ళెం సీరియల్‌గా వస్తూంటుందికనక పాఠక్స్ పత్రికల్ను జీర్ణం చేసుకోలేకపోయినా, అవి వారం వారం ఎగిరే పళ్లేలు కనుక ఎగరేసుకుపోతూంటారు.

కమింగ్ టు ది పాయింట్.. ఎగిరే పెళ్ళాలు ఎగిరెగిరి అప్పుడప్పుడు పుట్టింటి కెళ్ళి పడుతూంటారు. కొండొకచో వీరి ఎగురుళ్ళకు కారణమైన అహంకారధూళి, సంసారంనిండా వ్యాపించి నిజజీవితాలు మసకేసిపోవడం, అపేక్షలూ అభిమానాలూ కొట్టుకుపోవడం జరగొచ్చు. పెళ్ళాం ఎగుర్తోంది అనగానే తీసుకొనవలసిన జాగ్రత్తలు తీసుకోవాలి (సంసారాగ్ని మాపకదళంవారంటూ వుంటే వారిని పిలవాలి). బాహ్యపరిస్థితులవలన మనసులో పుట్టిన కల్లోలమైతే ఆ పరిస్థితుల్ని సానుభూతితో టాకిల్ చేయాలి. జన్మతః ఆవిడ నిప్పులకుంపటి అయితే ఆ మంటలో నీళ్లపోయాలి. ఇందుకు చీరలూ, రవికలూ, నగలూ, చేతినిండా డబ్బూ వాహనాలూ, సేవకులూ, వాసననూనెలూ చాలావరకు పనిచేస్తాయి. కాని కోరికలకు తీరడవంటూ వుండదుకదా! సినిమాలు సొసైటీకూడా మతమూ దేవతలుకూడా నిజం చెప్పక మన్ని మాయచేసి ఏడిపించుకు తింటున్న వాళ్లేకద. దేవుళ్ళు దొంగదేవుళ్ళు కాబట్టి "పతియే దైవము" అన్న ముక్కకు అర్థం ఏవిటి- నీ పతి దొంగదేవుడేసుమా అని. మొగుళ్ళు దొంగలైతే, పెళ్ళాలు పళ్లేలు ఎగరేయక మానుతారా? మానరు. (పళ్లేలను కడిగి తుడిచి శుభ్రంచేసేది పెళ్ళావేకదా. పళ్ళేలను ఎంగిలిచేయడం, పెళ్ళాలను ఎంగిలి చేయడం ఒకటికాదు).

ఎగిరే మొగుళ్ళకు ఎగరని పెళ్ళాలు లోకువ. ఎగరనిపెళ్ళాలకు వీపుమీద వాతలూ, మొహంనిండా మచ్చలూ, చంకలో త్యాగపు కన్నీళ్ళ బిందె, చేతిలో సంప్రదాయాల చీపురుకట్టా తప్పనిసరి. మంగళసూత్రం డేంజరు లైట్లా ధగధగా దళమా పయ్యెదలో నడంగియు సముద్యత్కాంతు లీనంగ మెరుస్తోవుంటుంది. "కంటినీరే కడవ నింపితి గదరా"అంటూ వుంటుందా మోహనాంగి. అణకువ నెమ్మది, మెత్తగా

మాటాడ్డం, దయగా చిరునవ్వు నవ్వడం, ఆర్ద్రనయనాలతో చూడ్డం. అపవిత్రమైన చూపులూ, ఆలోచనలు కలవారుకాని అశ్లీలంకాని దగ్గిరకు వస్తే భృకుటీకరించడం, భర్తయైనా సరే. పవిత్రమైన ఆలోచన్లు లేకుండా దగ్గరకు వస్తే.... హితబోధచేసి సన్మార్గానికి తిప్పడమో, సాని కొంపకు తోలటమో చేయడం సాధారణ కథానాయకి (నవలల్లో) చేసే అసాధారణకృత్యాలు.

ఎగిరే పళ్లేలనుంచి ఎగిరే పెళ్ళాలనుంచి తప్పుకుందుకు ఫస్టెయిడ్ బాక్సు ఓటుండాలి కొంపలో. ఫస్టెయిడుబాక్సులో ప్రేమ అనే టించర్ బెంజాయినుతోపాటు, పశ్చాత్తాపం అనే దూదికూడా హెచ్చుగా స్టాకు చేయాలి. తన తప్పుల్ని ఒప్పేసుగుని లెంపలు వాయించుకునే "ఆడ కత్తెర" మార్కు మనస్తత్వాన్ని ప్రదర్శించగలనేర్పు చాలాఅవసరం. నువ్వు దేవతవి నీకు నేను తగను నేను ఋంతని నువ్వు అపురూపతేజో విలాసినివి అంటూ పొగడి మాటల్తో బాండేజీ కట్టెయ్యాలి. నీకింకా కోపం తగ్గకపోతే నేను చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తం యిదిగో యీ కత్తితో నువ్వు నన్ను పొడుస్తావా, నేనే పొడుచుకుని నీ కాళ్ళ దగ్గర పడి చచ్చిపోయేదా అని(కత్తి ఆమె చేతికివ్వండి) చిన్న మోనోయాక్షన్ చేస్తే చాలు. ఎటువంటి కఠినపాషాణహృదయిని ఐనా పూర్ణవజ్రమేనా కరిగి నీరై ప్రవహిస్తుంది. ప్రవహించాలి— అది రూలు.

ఎగిరే పెళ్ళాం ఎప్పుడూ పాదదాసికాదు. ఆవిడ పాదరాణి అని గుర్తుంచుకుని జాగ్రత్తగా మెలగండి. సంసారంలోని గృహాభేదాలకు ఫస్టెయిడ్‌బాక్సుగురించి మరోమారు రాస్తా-బై! బై!